విద్యుత్ భారంపై జనాగ్రహం

- విద్యుత్ వినియోగదారులకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ
- తగరపువలసలో భారీ ర్యాలీ, నిరసన


తగరపువలస బైపాస్‌రోడ్డులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తగరపువలస: విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజలు భగ్గుమన్నారు. మద్దతుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తగరపువలసలో భారీ ఎత్తున నిరసన తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బైపాస్‌రోడ్డులోని వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద పోరుబాటలో పాల్గొని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, వీలైతే తగ్గిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు మాట తప్పారన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజల నుంచి రూ.6072 కోట్లు వసూలు చేయడం ప్రారంభించిన కూటమి ప్రభుత్వం కొత్త సంవత్సరంలో మరో రూ.9,412 కోట్ల భారం మోపడానికి సన్నాహాలు చేస్తోందన్నారు. దళితులకు 200 యూనిట్లు వరకు విద్యుత్ ఉచితమని చెప్పి, ఇప్పుడు భారీగా బిల్లులు ఇచ్చి బాదుడు కార్యక్రమానికి తెర తీశారన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ఆశ చూపిన సంక్షేమ పథకాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు తక్షణమే విద్యుత్ కనెక్షన్లు అందించాలన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు మిగిలిన నిత్యావసర సరకుల ధరలు దించాలన్నారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు ష్యూరిటీ ..బాదుడు గ్యారంటీ

'చంద్రబాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ', 'ఇది చంద్రబాబు పాలన .. చంద్రబాదుడు పాలన' అంటూ నినాదాలు చేస్తూ చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అర్బన్, రూరల్ ఏఈలు బొట్టా రవి, వి.హరికుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. నిరసనలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, కార్పొరేటర్ దొలవల్లి ఏడుకొండలు, ఎంపీపీ కంటుబుక్త రాంబాబు, వైస్ ఎంపీపీలు బోని బంగారునాయుడు, పాండ్రంగి శ్రీను, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మండల పార్టీ, జీవీఎంసీ వార్డుల అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, శిల్లా సరళారాణి, కరుణాకరరెడ్డి, గాడు శ్రీను, బంక సత్యం, మజ్జి వెంకటరావు, కోరాడ లక్ష్మణ, అల్లిపల్లి నరసింగరావు, జీరు వెంకటరెడ్డి, వాసుపల్లి కొండబాబు పాల్గొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు బోని అప్పలనాయుడు, సరగడ రఘునాథరెడ్డి, చెల్లూరి నగేష్, బోని సన్నిబాబు, సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, చందక సూరిబాబు, బాడితబోయిన రాములప్పుడు, కుంచా శివరామకృష్ణ, చిల్ల ప్రమీల, కోరాడ అప్పలస్వామినాయుడు, పాండ్రంగి అప్పారావు, ఉప్పాడ నాగేశ్వరరావు, దుంపల ప్రభాకర్, చిల్ల వెంకటరమణ, కరుభుక్త అప్పలనారాయణ, పందిరి విజయ్, అంజూరు అప్పారావు, మజ్జి సూరినాయుడు, బొడ్డు దుర్గారావు, ముద్దాడ సూరప్పుడు, గీతల దేవుడు, అక్కరమాని అప్పలనాయుడు, రమణ, వంశీరెడ్డి, సృజన, పద్మ, లక్ష్మీ, రౌతు శ్రీను, కూర్మారావు, ముసలినాయుడు, చింతగుంట శివ, చిల్ల గణేష్‌రెడ్డి, మల్లేటి హరి, భాగం సుధాకర్, నీలాపు రామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

సబ్సిడీ పేరుతో మోసం



ప్రతినెలా బిల్లుల్లో సబ్సిడీ ఇస్తున్నట్టు చూపిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. వాస్తవానికి అదే సబ్సిడీ మొత్తాన్ని ఎనర్జీ చార్జీలలో కలిపేసి బాదుతున్నారు. ఈ మోసం ఎవరికీ తెలియడం లేదు.

– సిమ్మల ప్రసన్న, చిట్టివలస

డబుల్ బాదుడు



ఇంధన కొనుగోలు అడ్జస్ట్‌మెంట్ పేరుతో నవంబరు వరకు కొంత భారం వేశారు. డిసెంబరు నుంచి అదే పేరుతో రెండు సార్లు భారం వేస్తున్నారు. దీంతో బిల్లులు భారంగా ఉంటున్నాయి.

– అర్జి హరి ఆటోడ్రైవర్, బాలాజీనగర్

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం



సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ ఆరు నెలల కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి జనం నడ్డి విరిచారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం అయ్యారు. మరొకవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి.

– దల్లి అప్పలరెడ్డి, కార్మిక నాయకుడు

శతశాతం ఉత్తీర్ణతపై దృష్టి పెట్టాలి

ఆర్‌జేడీ విజయభాస్కర్


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయ భాస్కర్

కొమ్మాది: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత శతశాతం సాధించేందుకు దృష్టి పెట్టాలని జోన్–1 ఆర్‌జేడీ బి. విజయ భాస్కర్ సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇప్పటి నుంచి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రణాళిక ప్రకారంగా విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా తగరపువలస మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కొత్తపేట, సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట, గణేష్ థియేటర్ రోడ్డు, ఆదర్శనగర్, సప్తగిరి లే అవుట్, చిట్టివలస కార్మికవాడ, రామన్నపేట, చిల్లపేట, జీరుపేట, ఊళ్లపేట, సంగివలస, తాటితూరు, టి.నగరపాలెం, మజ్జివలస, శింగనబంద, లక్ష్మీపురం, విజయరాంపురం, నారాయణరాజుపేట గ్రామాలకు పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం(టీటీడీ)లో శుక్రవారం వారాంతపు పూజలను వైభవంగా నిర్వహించారు. ముందుగా ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వేకువ జామున 5.30 గంటల నుంచి 6 గంటల వరకు తిరుప్పావై సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకువెళ్లారు. స్వామికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

130 మందికి ఉచిత వైద్య సేవలు


వైద్య శిబిరంలో పాల్గొన్న బ్యాంక్ బీఎం నాజిమ

మధురవాడ: కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా కొమ్మాది జంక్షన్ వద్ద గల బ్యాంక్ బ్రాంచ్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ సహాయ సహకారాలతో నిర్వహించిన శిబిరాన్ని బ్యాంక్ కొమ్మాది బ్రాంచ్ మేనేజర్ ఎస్‌కే నాజిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు, ఇతరులు 130మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన కస్టమర్స్ మీట్‌లో బీఎం నాజిమ మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీఎం హనీష్, ఎ.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో నటుడు నరేష్ సందడి

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లో శుక్రవారం సాయంత్రం సీనియర్ నటుడు నరేష్, పవిత్ర సందడి చేశారు. బ్యూటీ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను సాగర్ నగర్ బీచ్ వద్ద వీరిద్దరిపై చిత్రీకరించారు. షూటింగ్ విషయం తెలుసుకున్న స్థానికులతో పాటు ఇక్కడికి వచ్చిన పర్యాటకులు వీరితో ఫోటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.

ఘనంగా సీపీఐ వందేళ్ల వేడుకలు

మధురవాడ: సీపీఐ వందేళ్ల వేడుకల సందర్భంగా 5వ వార్డు నగరంపాలెంలో ఆ పార్టీ జెండాను సీనియర్ నాయకుడు వి.నరసింహులు ఆవిష్కరించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ మాట్లాడుతూ ఘన చరిత్ర ఉన్న, అందరికీ ప్రియమైన కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుంటోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.సన్నిపాత్రుడు, ఎం.సంధ్యకుమారి, పి.రమణ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల వితరణ


కుట్టు శిక్షణ కేంద్రానికి మిషన్లు అందిస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పీఎం పాలెం: మారికవలసలో కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్న సంస్థకు పీఎం పాలెం సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు శుక్రవారం 2 కుట్టుమిషన్లు అందజేశారు. కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు శిక్షణ సంస్థ నిర్వాహకులు తెలిపారు. జిల్లా సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్తలు సత్యనారాయణ, అపర్ణ, కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి

మధురవాడ: పెందుర్తి సుజాతనగర్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సీపీఎం విశాఖ జిల్లా 24వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ నాయకురాలు బి.భారతి కోరారు. కొమ్మాది జంక్షన్‌లోని పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం జెండా ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 28వ తేదీన ఉదయం 10గంటలకు పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి భారీ ప్రదర్శన అనంతరం సుజాత నగర్‌లో జరిగే బహిరంగ సభను అంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డి. అప్పలరాజు, కె.సుజాత, కె.మణి, టీకే శారద, కె.పుష్ప, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులను మరింత ఆకర్షించేలా అభివృద్ధి

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ


తీరంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ పర్యాటకాన్ని ప్రపంచ విఖ్యాతం చేసేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. జిల్లాలోని టూరిజం ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా శుక్రవారం సాయంత్రం రుషికొండ ప్యాలెస్, రుషికొండ బీచ్, మంగమారిపేట బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి కంటైనర్ రెస్టారెంట్, భీమిలి బీచ్, తొట్లకొండలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తమ ప్రమాణాలతో పర్యాటకులను మరింత ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. మంగమారిపేటలోని 17 ఎకరాల్లో బీచ్ రిసార్ట్ ఏర్పాటు, తొట్లకొండ బీచ్ వద్ద ఉన్న 2.4 ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాలు అదనంగా సేకరించి, ఫుడ్ కోర్టు, రిసార్టులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

వంగవీటి రంగాకు నివాళి


వంగవీటి మోహన రంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

మధురవాడ: వంగవీటి మోహనరంగా 35వ వర్ధంతిని మధురవాడ కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వైజాగ్ ఓల్డ్ ఏజ్ హోంలో పసుపులేటి సురేష్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. మధురవాడ కాపు సంఘం నాయకులు సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పసుపులేటి గోపీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వైఎస్ మూర్తి, పి.కృష్ణారావు, అడ్వకేట్ బంటుపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా 'గ్రాండ్ క్రిస్మస్'


వేడుకల్లో పాల్గొన్న మహిళలు, నిర్వాహకులు

పద్మనాభం: ఏసు లోక రక్షకుడని పీబీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఎం.ఎస్.స్వరూప్ అన్నారు. మండల పరిధి కోరాడలోని ఏఎఫ్‌ఎం క్యాంపస్ చర్చిలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 50 మంది మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఏంజిలా ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పద్మకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండ్రోతు శ్రీనివాసరావు, రెవరండ్ జెస్సీ రత్నకుమార్ పాల్గొన్నారు.

అంత్యక్రియలను అడ్డుకున్న గ్రామస్తులు

- కుమార్తె కాపురంలో కలహాల వల్లే తండ్రి ఆత్మహత్య
- యామినికి కుమారుడిని అప్పగించాలని ఆందోళన
- పోలీసుల జోక్యంతో ఇరువర్గాల రాజీ


విలపిస్తున్న మృతుడి కుమార్తె యామిని

తగరపువలస: నెల్లూరు జిల్లా కలిగిరి మండలం తూర్పు దూబగుంటలో ఆత్మహత్య చేసుకున్న నగరానికి చెందిన ఇటుకల వ్యాపారి బొట్ట శ్రీనివాసరావు అంత్యక్రియల్లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కుమార్తె యామిని కాపురంలో కలహాలు, మనుమడిని అల్లుడు తీసుకుపోవడంతో మానసికంగా కుంగిపోయిన శ్రీనివాసరావు సొంత ఊరు కలిగిరికి వెళ్లి బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. శ్రీనివాసరావు మృతదేహం శుక్రవారం ఉదయం భీమిలి మండలంలోని టి.నగరపాలెం చేరుకుంది. అయితే, యామిని కుమారుడిని అత్తింటివారు ఆమెకు అప్పగిస్తే తప్ప శ్రీనివాసరావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేది లేదని టి.నగరపాలెం వాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మృతదేహంతో సంగివలసలోని యామిని అత్తింటి వద్ద నిరసన తెలియజేయడానికి వెళ్తున్న వారిని భీమిలి సీఐ బి.సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డగించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అప్పటి వరకు మృతదేహాన్ని గొల్లలపాలెం రోడ్డుపై అంతిమయాత్ర వాహనంతో నిలిపివేశారు. యామిని కుమారుడిని అత్తింటివారు ఆమెకు అప్పగించాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో వామపక్షాల నాయకులు కూడా పాల్గొన్నారు. మధ్యాహ్నం మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజుతో పాటు ఆనందపురం, గోపాలపట్నం, పీఎం పాలెం సీఐలు అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో చర్చలు జరిపారు. చివరికి సాయంత్రం 5 గంటల సమయంలో వారికి రాజీ కుదిరింది. నాలుగు రోజుల్లో యామిని కుమారుడిని అప్పగించడానికి ఆమె అత్తింటి వారు పోలీసుల సమక్షంలో ఒప్పుకోవడంతో శ్రీనివాసరావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.


టి.నగరపాలెంలో ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఏసీపీ అప్పలరాజు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులు

తగరపువలస: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భీమిలి ఆదర్శప్రేమీ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌బీఐ గవర్నర్‌గా, పార్లమెంట్ సభ్యుడిగా, మంత్రిగా, ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన అనుసరించిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్లే దేశం అభివృద్ధి చెందుతోందన్నారు.

వెంకటాపురం రెవెన్యూ సదస్సుకు 18 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 18 మంది దరఖాస్తు చేసుకున్నారు. మ్యుటేషన్ కోసం 10 మంది, సర్వేకు ఐదుగురు, కులం సర్టిఫికెట్లకు ఇద్దరు, 22ఏ కోసం ఒకరు దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కె.ఆనందరావు ఈ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుంతీ మాధవుడికి నవనీత శోభ

- 20 కిలోల వెన్నతో స్వామికి అలంకరణ



పద్మనాభం: కుంతీ మాధవస్వామి నవనీత అలంకరణలో శోభాయమానంగా దర్శనమిచ్చారు. పద్మనాభంలోని ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న నవనీత ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు భక్తులు సమర్పించిన 20 కిలోల వెన్నతో కుంతీ మాధవ స్వామిని సుందరంగా అలంకరించారు. అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత వేణు గోపాలస్వామిని ఒక పల్లకీలో, గోదాదేవిని మరో పల్లకిలో ఉంచి బేడా సేవ నిర్వహించారు. తదుపరి ఏడు గంటల నుంచి నవనీత అలంకరణలో ఉన్న స్వామి దర్శనాలు కల్పించారు. శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు స్వామి ఈ అలంకరణలో దర్శనమిస్తారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భక్త బృందం సభ్యులు తాలాడ పద్మనాభం, తాలాడ నరిసింహనాయుడు, కంటుబోతు ఎర్నాయుడు, కాళ్ల సత్యనారాయణ, తాలాడ పైడిరాజు, మొకర సన్నిబాబు, భక్తులు కుంతీ మాధవుని దర్శించుకుని, పూజలు చేశారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం


ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీఎంవో ఉమావతి

పీఎం పాలెం: ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వ వైద్య సిబ్బంది నిరంతరం సిద్ధంగా ఉండాలని డీపీఎంవో డాక్టర్ బి.ఉమావతి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆమె స్వతంత్రనగర్, వాంబే కాలనీల్లోని ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా ఈహెచ్ఆర్, ఈ–ఔషధీ, ఎన్‌సీడీ, 3.0 సర్వే రిపోర్టులపై సమీక్షించారు. స్థానిక వైద్యాధికారుల, సిబ్బంది హాజరు పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌బీఎస్‌కే స్కూల్ విజిట్స్ తదితర రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


కస్తూర్బా విద్యాలయంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

పద్మనాభం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండలంలోని అనంతవరం, గంధవరం, పాండ్రంగి, పద్మనాభం, మద్ది, రెడ్డిపల్లి, రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పద్మనాభం కస్తూర్బా విద్యాలయాలను శుక్రవారం ఆయన సందర్శించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బోని సూర్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు, నమ్మి పద్దరాజు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని ఫ్రీ లెఫ్ట్

- సిగ్నల్స్ వద్ద అవకాశం ఉన్నా పట్టించుకోని పోలీసులు
- వాహన చోదకులకు తప్పని నిరీక్షణ
- మధురవాడ అంతటా ఇదే పరిస్థితి


కొమ్మాది సిగ్నల్ వద్ద మార్జిన్‌లో నిలిపిన వాహనాలు

మధురవాడ: రద్దీగా ఉండే కూడళ్లలో అమలు చేయాల్సిన ఫ్రీ లెఫ్ట్ విధానం మధురవాడలో అమలుకాక వాహనచోదకులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు దీని గురించి పట్టించుకోవడం మానేశారని పలువురు విమర్శిస్తున్నారు. ఫ్రీ లెఫ్ట్ మార్జిన్‌పై వాహనాలు నిలపకుండా ఎడమ చేతి వైపునకు మళ్లించేలా చేసే పని తమది కాదన్నట్లే వ్యవహరిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల తక్కువ వ్యవధిలోనే సర్వీస్‌రోడ్డులోకి తిరిగిపోయే అవకాశం ఉన్నా, పోలీసుల నిర్లక్ష్యంతో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. గతంలో ఏసీపీ చర్యలు చేపడతామని చెప్పినా, ఆచరణకు నోచుకోలేదు.


మారికవలస వద్ద ఇదే పరిస్థితి..

ప్రధానంగా ట్రాఫిక్ ఇబ్బంది ఇక్కడే..

మధురవాడలో ప్రధానంగా కార్‌షెడ్, కొమ్మాది, క్రికెట్ స్టేడియం, మారికవలస ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది ఎక్కువగా ఉంటోంది. ఒక్కోసారి గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోతున్నాయి. దీంతోపాటు బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణాలు చేసే వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది.


మధురవాడలో నిలిచిపోయిన ట్రాఫిక్


కొమ్మాది సిగ్నల్ వద్ద సర్వీసు రోడ్డులోకి వెళ్లడానికి వీల్లేకుండా ఏర్పాటు చేసిన స్టాపర్లు

ఇలా చేస్తే మేలు

- ఎండాడ సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్ అమలు చేయడం వలన ఎంత ట్రాఫిక్ ఉన్నా ఇబ్బందులు చాలావరకు తగ్గుతున్నాయి. మధురవాడలో 4 సిగ్నల్స్ వద్ద దీనిని అమలు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయి.
- ఈ సిగ్నల్స్ వద్ద మార్జిన్‌పై భారీ వాహనాలు నిలవకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలి. దీనివల్ల ద్వి చక్రవాహనాలు, లైట్ వెహికల్స్ వంటివి రెడ్ సిగ్నల్ ఉన్నా సర్వీసు రోడ్డులోకి ఎడమ చేతివైపు నుంచి తిరిగివెళ్లే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఎక్కువ సమయం సిగ్నల్స్ వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేదు. భారీ వాహనాలకు కూడా ట్రాఫిక్ తగ్గి మరింత సులువుగా వెళ్లిపోతాయి. ఈ పద్ధతిని కొమ్మాది, కార్‌షెడ్ సిగ్నల్స్ వద్ద అమలు చేస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి.

పరిశీలిస్తాం

ఎండాడలో హైవేపై ఫ్రీలెఫ్ట్ వల్ల మంచి ప్రయోజనాలు వస్తున్నాయి. మధురవాడ, ఇతర ప్రాంతాల్లో అమలుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. అలాగే, వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ఈ సమస్య చాలావరకు తగ్గుతుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అందరూ సహకరించాలి.

– ఎస్.సాయి, నార్త్ జోన్ ట్రాఫిక్ సీఐ